సాక్షి కామారెడ్డి

గురువారం । 13 । జూన్ । 2024



వృద్ధురాలి దారుణ హత్య

నగల కోసం వృద్ధురాలి గొంతుకోసి దారుణంగా హతమార్చిన ఘటన బాన్సువాడలో చోటుచేసుకుంది.

- 8లో ▸



పడకేసిన పారిశుధ్యం

గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పర్యవేక్షించేవారు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.6 /22.7

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

బ్లాక్ స్పాట్స్‌పై ఫోకస్!

- కూడళ్ల వద్ద వంతెనల నిర్మాణం
- ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు
- జిల్లాలో మూడు చోట్ల నిర్మాణాలు
- వేగంగా సాగుతున్న పనులు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డిలో జిల్లాలోని 44వ నంబరు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చర్యలు చేపట్టింది. తరచుగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి యాక్సిడెంట్లు జరగకుండా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం బ్లాక్‌స్పాట్లలో వంతెనలను నిర్మిస్తున్నారు. నిత్యం హైవే మీదుగా వేలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఉత్తర భారతం నుంచి దక్షిణ భారతానికి సరకు రవాణా ఎక్కువగా జరుగుతుంది. ఇదే సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలు సొంత వాహనాలు, ట్రావెల్స్‌లో ప్రయాణాలు చేస్తుంటారు బెంగుళూరు నుంచి హైదరాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ మీదుగా నాగ్‌పూర్ వరకు వెళ్లే ఎన్‌హెచ్-44 రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరగడం, పలువురు ప్రాణాలు కోల్పోతుండడంతో పలు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా బైపాస్ నుంచి పట్టణాలకు వెళ్లే రోడ్ల కూడళ్ల వద్ద రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరిగేవి. వాటిని నివారించేందుకు పలు కూడళ్ల వద్ద వంతెనల నిర్మాణాలు చేపట్టింది. జాతీయ రహదారి నుంచి కామారెడ్డి పట్టణంలోకి ఎంటర్ అయ్యే నర్సన్నపల్లి చౌరస్తా, అలాగే టేక్రియాల్ చౌరస్తా వద్ద వంతెనల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడీ చౌరస్తా వద్ద కూడా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒక్కో వంతెనకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం పనులు చురుకుగా నడుస్తున్నాయి. మూడు, నాలుగు నెలల్లో పనులు పూర్తయి వంతెనలు వినియోగంలోకి రానున్నాయి. మరోవైపు హైవేపై ఏర్పడిన గుంతలపై ప్యాచ్ వర్క్ చేసిన అనంతరం బీటీ వేస్తున్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్న ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు చేస్తున్నారు. కొన్ని చోట్ల యూటర్న్‌లను మూసి వేశారు.



టేక్రియాల్ చౌరస్తా వద్ద కొనసాగుతున్న వంతెన పనులు



చురుకుగా పనులు..



జాతీయ రహదారిపై నర్సన్నపల్లి, టేక్రియాల్, పద్మాజివాడి చౌరస్తాల వద్ద వంతెనల నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. గతేడాది పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం వంతెనల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. ఇరువైపులా రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. మరో మూడు, నాలుగు నెలల్లో వంతెనల పనులు పూర్తయి వినియోగంలోకి రానున్నాయి. మూడు ప్రధాన కూడళ్ల వద్ద వంతెనలు నిర్మించడం మూలంగా ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ఆస్కారం తగ్గిపోతుంది. అలాగే వాహనాలు ఎలాంటి ఆటంకం లేకుండా నేరుగా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

మరికొన్ని వంతెనలు అవసరం..

దోమకొండ, బీబీపేట ప్రాంతాల నుంచి బీటీఎస్ వద్ద అప్పట్లో చిన్న వంతెన నిర్మించారు. దీంతో బస్సులు, లారీలు జాతీయ రహదారిపైకి వెళ్లడానికి చుట్టూ తిరగాల్సి వస్తోంది. అక్కడికి సమీపంలో ఉన్న రెండు యూటర్న్‌లను మూసి వేశారు. దీంతో దోమకొండ, బీబీపేట ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, లారీలు, వ్యాన్లు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరాన ఉన్న భిక్కనూరు టోల్ ప్లాజా వద్దకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. తద్వారా దూరభారం పెరగడంతో పాటు ఇంధనం వృథా అవుతోంది. ఇక్కడ ప్రస్తుతం ఉన్న వంతెన చిన్నది కావడంతో బస్సులు అందులో నుంచి వెళ్లే పరిస్థితి లేదు. సిద్దిపేట, దుబ్బాక, బీబీపేట, దోమకొండ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న వంతెనను విస్తరించడమో, కొత్త వంతెన నిర్మించడమో చేస్తే గానీ ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీరవని అంటున్నారు. అలాగే జాతీయ రహదారి బైపాస్ నుంచి భిక్కనూరు మండల కేంద్రానికి ఇరువైపులా కూడళ్ల వద్ద ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు దాటే క్రమంలో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. రెండు చోట్ల వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు గురువారం తెలంగాణ యూనివర్సిటీలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు దోస్త్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెయూ అకడమిక్ ఆడిట్ సెల్ విభాగంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. పీహెచ్‌సీ(దివ్యాంగులు)/ సీఏపీ/ ఎన్‌సీసీ / ఎక్స్‌ట్రా కరిక్యులమ్ ఆక్టివిటీస్ విద్యార్థులకు మాత్రమే ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు.

మహిళా సంఘాల పనితీరు పరిశీలన



దోమకొండ: మహిళా సంఘాల పనితీరును అసోం రాష్ట్ర బృందం సభ్యులు బుధవారం దోమకొండ మండలంలో పరిశీలించారు. 15 మంది బృందం సభ్యులు స్వయం సహాయక సంఘాల పనితీరుపై వివరాలు సేకరించారు. మహిళా సంఘాలు చేపట్టిన పొదుపు బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలు తీసుకుని వారు చేస్తున్న ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. సంఘాల సమావేశాలు, వాటి నిర్వహణ, బ్యాంకు లింకేజీ పుస్తకాల నిర్వహణ జీవనోపాదుల పెంపుపై సంఘాల సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వారికి వివరించారు. కార్యక్రమాల వివరాలను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌కుమార్ వారికి హిందీలో వివరించారు. కార్యక్రమంలో డీపీఎం వకుల, ఎంపీఎం రాజు, సీసీలు రమేశ్, ప్రవీణ్, శ్రీనివాస్, రామకృష్ణ, కంపెనీ సీఈవో రవి, అకౌంటెంట్ స్వాతి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



కామారెడ్డి క్రైం: విద్య ద్వారానే సమాజంలో వ్యక్తులకు గుర్తింపు లభిస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 3, 5, 8వ తరగతుల్లో గిరిజన బాలురు, బాలికల ఎంపిక కోసం కలెక్టరేట్‌లో బుధవారం లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. లక్కీ డ్రాలో విజేతగా నిలిచిన చిన్నారులను అభినందించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. మూడో తరగతిలో 11 సీట్లు ఉండగా 59 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఐదో తరగతిలో ఆరు సీట్లకు 68 మంది విద్యార్థులు, 8వ తరగతిలో ఐదు సీట్లకు 32 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. మొత్తం 22 సీట్లకు 159 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిలో 22 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధరణి టౌన్‌షిప్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూరు శివారులో ఉన్న ధరణి టౌన్‌షిప్‌లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష నిర్వహించారు. బీటీ రోడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మురికి కాల్వల నిర్మాణం వంటి మౌలిక వసతుల ఏర్పాటుకు అధికారులు అంచనాలు రూపొందించాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, రెవెన్యూ పర్యవేక్షకులు జ్యోతి, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, మున్సిపల్ ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని గంజ్ హైస్కూల్‌లో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు



బడి గంట మోగింది..

- మొదటి రోజు స్కూళ్లకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు

కామారెడ్డి టౌన్: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల్లోపే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు ఉత్సాహంగా హాజరయ్యారు. నూతన విద్యార్థుల పేర్లను ఉపాధ్యాయులు నమోదు చేసుకున్నారు. మొదటి రోజు కావడంతో చాలా బడుల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరుకాలేదు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా స్వాగతం పలికి పరిచయాలు చేసుకుని బోధనలు ప్రారంభించారు. ఇంకా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సైతం వందశాతం విద్యార్థులు రాకపోవడంతో హాస్టళ్లు వెలవెలపోయాయి.



విద్యార్థుల పేర్లు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

కామారెడ్డి టౌన్: ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ బీ కంపెనీ, కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 14న సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8074065803, 9701665424 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించాలి



నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం

- ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహణ కోసం గదులను కేటాయించాలని హైస్కూల్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డిని ఆయన కోరారు. దీంతో పాటు కళాశాలలో అడ్మిషన్లను పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగిరెడ్డిపేట ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో తరగతులు కొనసాగుతాయన్నారు. కళాశాలలో ఎలాంటి రుసుము చెల్లించకుండా అడ్మిషన్ పొందవచ్చన్నారు. దీంతో పాటు తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిస్తామని, విద్యార్థులకు స్కాలర్‌షిప్ సైతం వస్తుందని చెప్పారు. నాగిరెడ్డిపేటలోని కళాశాలలో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ హేమచందర్, అధ్యాపకులు విష్ణు, నాగయ్య, రమేశ్, సిబ్బంది హైమద్‌తో పాటు హైస్కూల్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తే ఊరుకునేది లేదు

- బల్దియా అధికారులపై కేవీఆర్ ఆగ్రహం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే



కాంగ్రెస్ కౌన్సిలర్లను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ హోటల్ ముందు అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేయడం వివాదానికి దారితీసింది. బల్దియా అధికారుల తీరుపై కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తెల్లవారుజామున మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఓ నిర్మాణాన్ని కూల్చివేయడంతో ఎమ్మెల్యే మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్ సుజాత, టీపీవో గిరిధర్, టీపీఎస్ రాజేశ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక్క నిర్మాణం కూల్చివేతపైనే ఆసక్తి ఎందుకు చూపారని, తెల్లవారుజామునే వెళ్లి కూల్చేసేందుకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. మరి నోటీసులు జారీ చేసిన మిగతా అక్రమ నిర్మాణాలను కూడా కూల్చివేయడానికి వెళ్దామని ఆదేశించారు. చైర్‌పర్సన్ నుంచి కానీ, కాంగ్రెస్ నేతల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయా అని అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో అక్కడే ఫోన్‌లోనే మాట్లాడారు. తాను కానీ, తమ నేతలెవరూ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేదని షబ్బీర్ అలీ సమాధానం ఇచ్చారు. రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపుపై ప్రజల నుంచే స్వచ్ఛందంగా మార్పు రావాలనే ఉద్దేశంతో రెండు రోజుల క్రితం ప్రజలతో చర్చ జరిపానని ఇప్పుడు ఆ ఉద్దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. తానే కూల్చివేయిస్తున్నానని అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడే చైర్‌పర్సన్ ఇందుప్రియ రాగా ఎమ్మెల్యేకు నమస్కారం పెట్టి కార్యాలయంలోకి వెళ్లిపోయారు. ఆమె వెంట వచ్చిన కాంగ్రెస్ కౌన్సిలర్లు శివప్రసాద్, వంశీలను ఎమ్మెల్యే నిలదీశారు. ఇంత ఆసక్తితో ఎందుకు కూల్చివేయించారని.. ప్రజలను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. ఈ తరుణంలో కాసేపు ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. హోటల్ యజమాని వచ్చి కాంగ్రెస్ కౌన్సిలర్లపై ఆగ్రహం చెందారు. ఈ క్రమంలో అక్కడ కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు, నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఎమ్మెల్యే కేవీఆర్ కమిషనర్ సుజాత చాంబర్‌లోకి వెళ్లి చర్చించారు. నిబంధనల మేరకు నడుచుకోవాలని.. ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని హెచ్చరించారు.

దేశాభ్యున్నతికి విద్య కీలకం

- విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): దేశాభ్యున్నతికి విద్య అనేది ఎంతో కీలకమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం నిజాంసాగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. విద్యాబోధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రతిఒక్క ఉపాధ్యాయుడు తమ వంతు బాధ్యతను నెరవేర్చాలని సూచించారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతుల నిర్వహణ కోసం పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, ఎంఈవో దేవిసింగ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, తహసీల్దార్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్య వల్ల తల్లిదండ్రులకు రూ. లక్షల ఫీజు భారం తప్పా పిల్లలకు ప్రయోజనం ఉండదన్నారు. బుధవారం నిజాంసాగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాటలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుతో కలిసి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించానని తెలిపారు. తాను ప్రభుత్వ బడిలో చదవడం వల్లే కలెక్టర్ అయ్యానన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో బస్సు చార్జీలు, పుస్తకాలు, డ్రెస్సులు, ఫీజుల కోసం రూ. లక్షల ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, డ్రెస్సులు, ఉచితంగా ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు జవాబుదారీతనంగా పని చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, ఎంఈవో దేవిసింగ్, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా జడ్జి వరప్రసాద్

కామారెడ్డి క్రైం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా జడ్జి సూచించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కామారెడ్డిలోని గిరిజన బాలికల వసతిగృహంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం బాగా చదువుకోవాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎలాంటి న్యాయ సహాయం కోసమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. వరల్డ్ డే అగైన్స్ట్ చైల్డ్ లేబర్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి, న్యాయవాదులు రమేశ్‌చంద్, చిరంజీవి, వసతి గృహం వార్డెన్ స్వప్న, సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, అధికారులు ఖాన్, సాయి ప్రణీత్, సాయికృష్ణ, ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమృత రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

క్లుప్తంగా

కరాటే పోటీల్లో దోమకొండ క్రీడాకారుల ప్రతిభ



దోమకొండ: మహారాష్ట్రలో ఈ నెల 7 నుంచి 10 వరకు జరిగిన ఏసియన్ గోజుర్యూ కరాటే ఫెడరేషన్ పోటీల్లో దోమకొండకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు కరాటే తెలంగాణ గ్రాండ్ మాస్టర్ కామిండ్ల రాజయ్య బుధవారం తెలిపారు. పోటీల్లో భారత్‌తో పాటు, ఇండియా, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, కజకిస్తాన్, దుబాయ్ దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన 14 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా.. వారిలో ఐదుగురికి బంగారు పతకాలు, ఇద్దరికి వెండి పతకాలు, ఐదుగురు రజత పతకాలు సాధించారన్నారు. అదేవిధంగా ఆసియా కరాటే గోజుర్యూ రిఫరీలుగా దోమకొండకు చెందిన కామిండ్ల నవీన్, దీకొండ సాత్విక్‌లు ఎంపికైనట్లు వివరించారు. కోచ్ విభాగంలో కోడూరి సాయినాథ్, రాజేందర్, సంతోష్, లక్ష్మినర్సు, కుమార్‌లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

మిషన్ భగీరథ సర్వేను వేగవంతం చేయాలి



దోమకొండ: గ్రామాల్లో ఉన్న మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్ల సర్వేను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల కేంద్రంలో కుళాయి సర్వేను పరిశీలించారు. ఇప్పటి వరకు ఇచ్చిన డేటాను వంద శాతం పూర్తి చేయాలని కోరారు. డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రమేష్, ఎంపీవోలు తిరుపతి రెడ్డి, రాజు, ఏపీవో రజని, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



భిక్కనూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. భిక్కనూరు టోల్‌ప్లాజా మీదుగా టీఎస్15ఏఎల్‌టీఆర్ 3024 వ్యాన్‌లో 30 క్వింటాళ్ల 13 కిలోల బియ్యాన్ని తరలిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్యకు సమాచారం అందించి, ఆయన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని జంగంపల్లి ప్రభుత్వ గోదాముకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: మాక్లూర్‌లోని గిరిజన సంక్షేమ మినీ గురుకులంలో ఒకటో తరగతిలో కొత్త అడ్మిషన్లు, రెండో తరగతిలో మిగిలి ఉన్న ఒకటి, ఐదో తరగతిలో ఆరు సీట్ల కోసం ఎస్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కో ఆర్డినేటర్ టి సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని, మాక్లూర్ మండలానికి చెందిన విద్యార్థినులకు తొలి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. మినీ గురుకులంలో సీబీఎస్ఈ సిలబస్ విద్యాబోధన ఉంటుందని తెలిపారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్): ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులు దృష్టి సారించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, అటవీ, విద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం కానుండటంతో పైపులైన్ల లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, అన్ని గ్రామాలకు భగీరథ నీటి సరఫరా కోసం ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేయాలని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీల్లో రక్షిత ట్యాంకులను శుభ్రం చేయించి పారిశుద్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు పున: ప్రారంభం కావడటంతో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, మండలాల వారీగా అభివృద్ధి పనులు పురోగతి సాధించేలా పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్యసమాజ్, జమా మజీత్ వద్ద సీసీ రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.25 లక్షల ఎన్‌ఆర్‌జీఈజీఎస్ నిధులతో ఈ సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగే హన్మండ్లు, జుక్కల్ నియోజకవర్గ యూత్ నాయకులు ఇమ్రోజ్, నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



పుస్తకాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలని, ఇక్కడ చదివిన వారు ఐఏఎస్, ఐపీఎస్‌లాంటి ఉన్నత స్థానాలలో ఉద్యోగాలు చేస్తున్నారని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం డీఈవో రాజుతో కలసి క్రిష్ణాజివాడిలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని పరిశీలించి, అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం ఇవ్వడమే కాకుండా నాణ్యమైన భోజనాన్ని అందిస్తుందన్నారు. అనంతరం డీఈవో రాజు మాట్లాడారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఉచిత నోట్ బుక్స్‌లు, డిజిటల్ బోధన ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఎంఈవో రామ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: సాధన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 'వరల్డ్ డే అగైనెస్ట్ చైల్డ్ లేబర్' వాల్ పోస్టర్‌లను ఎస్పీ సింధు శర్మ చేతుల మీదుగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లాలో సంస్థ ఆధ్వర్యంలో 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లల కోసం చేపడుతున్న కార్యక్రమాలను సంస్థ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కొప్పుల రవి ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, సాధన ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై పోలీసులకు ఫిర్యాదు

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం భూమిలో అక్రమ కట్టడంపై ఆలయ ఈవో శ్రీధర్ భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్‌లకు బుధవారం ఫిర్యాదు చేశారు.

ఆలయానికి చెందిన ఒక ఎకరం భూమిని గ్రామానికి చెందిన ఉప్పరి భూమయ్య కౌలుకు తీసుకున్నారని, ఈ స్థలంలో అన్య మతానికి చెందిన కట్టడాన్ని నిర్మించాడని, అలాగే రేకులతో షెడ్డు కూడా వేస్తున్నాడని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని అన్యమతానికి చెందిన కట్టడాన్ని తొలగింపజేయాలని ఈవో శ్రీధర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ద్వారా కోరారు.

పచ్చలనడ్కుడలో 144 సెక్షన్ అమలు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో గురువారం నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై వినయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఎక్కడ కూడా నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండొద్దని సూచించారు. పెద్దవాగు ఇసుక విషయంలో పచ్చలనడ్కుడ, జాన్కంపేట్ గ్రామాల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో వివాదాస్పద స్థలం నుంచి ఇసుక తీయొద్దని ఏప్రిల్ 8న ఆర్మూర్ సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. బుధవారం పచ్చలనడ్కుడ వీడీసీ సభ్యులు, కొంతమంది గ్రామస్తులు చట్టవిరుద్ధంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం నుంచి ఇద్దరు సభ్యులు గురువారం ఉదయం పెద్దవాగులో ఇసుకను సేకరించేందుకు రావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి వేల్పూర్ తహసీల్దార్ డి సరిత 144 సెక్షన్ ఉత్తర్వును జారీచేసినట్లు ఎస్సై ప్రకటనలో తెలిపారు.

మహిళ కాళ్లపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు



ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్ బస్సును నిర్లక్ష్యంగా నడపడంతో సుజాత అనే మహిళ తీవ్ర గాయాల పాలైంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సుజాత బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నివాసం ఉంటున్న తన కూతురు వద్దకు బస్సులో వచ్చింది. బస్సు దిగి బస్టాండ్ వెలుపలికి వెళ్తుండగా అప్పుడే రివర్స్ తీస్తున్న మరో బస్సు (నిర్మల్ డిపో) మహిళను ఢీకొంది. దీంతో మహిళ బస్సు వెనుక చక్రాల కింద పడటంతో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జు అ య్యాయి. ప్రయాణికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.కాగా మహిళ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. బస్సును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్య

రామారెడ్డి: అప్పుల తీర్చే మార్గంలేక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రామారెడ్డికి చెందిన కుమ్మరి నారాయణ(52) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు చేసిన అప్పులు తీర్చే మార్గంలేకపోవడంతో జీవితంపై విరక్తితో మంగళవారం విషం సేవించగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో నారాయణ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.

కాపర్ కాయిల్స్ చోరీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని వెల్లుట్లపేట శివారులో ఉన్న 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంగళవారం దండగులు కాపర్‌తోపాటు ఆయిల్ ఎత్తుకెళ్లినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. రైతు సాయాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బస్సును ఢీకొట్టిన టిప్పర్

డిచ్‌పల్లి: కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మండలంలోని బర్దీపూర్ శివారులో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. మాధవనగర్ బైపాస్ రోడ్డుపై ఒకవైపు తారు వేస్తుండడంతో మరో వైపు నుంచే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం ఉదయం 11 గంటలకు కామారెడ్డి డిపో బస్సును టిప్పర్ ఢీకొట్టగా బస్సు డ్రైవర్‌కు గాలయ్యాయి. ప్రమాదం జరిగిన తరువాత టిప్పర్ డ్రైవర్ వాహనంతోపాటు పరారైనట్లు బస్సు కండక్టర్ తెలిపారు. ఈ విషయమై డిచ్‌పల్లి పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి పద్మావతి

నిజామాబాద్‌నాగారం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ సాధికారిత సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, న్యాయమూర్తి పద్మావతి పిలుపునిచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నగరంలోని ధర్మపురి హిల్స్ డ్రైవర్స్ కాలనీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి పద్మావతి మాట్లాడుతూ.. 14 సంవత్సరాల లోపు పిల్లలు కచ్చితంగా చదివే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు చదువుకుంటేనే దేశ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, కుటుంబాలు కూడా బాగుపడతాయన్నారు. పిల్లలు ఎక్కడైనా పనిలో ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యోహాన, బాల రక్ష భవన్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, డీసీపీవో చైతన్యకుమార్, నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి సీడీపీవో నందిని, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ జ్యోత్స్న, ఐసీడీఎస్, డీసీపీయూ, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని నేలకేసికొట్టి హత్య

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని ఘాతుకం



మృతి చెందిన మహన్వి

చివ్వెంల(సూర్యాపేట): వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని చిన్నారిని నేలకేసి కొట్టి హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా గుండారం గ్రామానికి చెందిన కటకట లక్ష్మణ్‌తో అదే జిల్లా సాటాపూర్ గ్రామానికి చెందిన రమ్య అలియాస్ నవ్యశ్రీ వివాహం ఆరేళ్లక్రితం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు అరుణ్య (4), మహన్వి(22 నెలలు). కాగా ఏడు నెలలుగా రమ్యశ్రీ అదే గ్రామానికి చెందిన బొల్లెం అరవింద రెడ్డితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. 20 రోజుల క్రితం ఇద్దరు పిల్లలను తీసుకుని ప్రియుడితో కలిసి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి వచ్చి అక్కడే నివాసం ఉంటున్నారు. అరవిందరెడ్డి ఇటుక బట్టీల వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నారి మహన్వి తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని భావించి మంగళవారం రాత్రి అరవిందరెడ్డి ఆమెను కొరికి, కొట్టి హింసించి నేలకేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రమ్య అత్త గంగమణి ఫిర్యాదు మేరకు సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి ఆదేశాలతో ఎస్ఐ బి వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి దారుణహత్య

- గొంతు కోసి నగలు ఎత్తుకెళ్లిన దుండగులు
- బాన్సువాడలో ఘటన



సాయమ్మ(ఫైల్)



మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ : నగల కోసం దుండగులు వృద్ధురాలి గొంతుకోసి హత్యచేసిన ఘటన బుధవారం బాన్సువాడలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఉప్పరి శంకర్ అనే వ్యక్తికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించగా, కొడుకు కుటుంబ సభ్యులతో కలిసి తల్లి సాయమ్మ(75) అందులోనే ఉంటోంది. కొన్ని రోజుల కిత్రం శంకర్ తన భార్యాపిల్లలతో కలిసి కూలీ పని చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం రాత్రి సాయమ్మ స్థానికులతో చాలాసేపు మాట్లాడి ఇంట్లోకి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం శంకర్ ఎన్ని సార్లు ఫోన్ చేసినా సాయమ్మ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి అదే బ్లాక్‌లో ఉన్న తెలిసిన వారికి ఫోన్ చేశాడు. తన తల్లి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని వెళ్లి చూడాలని కోరగా, వారు వెళ్లి చూసే సరికి సాయమ్మ రక్తపు మడుగులో పడి ఉంది. సాయమ్మ చెవులకు, మెడలో ఉన్న బంగారు ఆభరణాల కోసం ఆమెను గొంతుకోసి హత్య చేశారని స్థానికులు పేర్కొంటున్నారు. డీఎస్పీ సత్యనారాయణ, సీఐ కృష్ణ ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతురాలి పెద్ద కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసులకు సవాలుగా మారిన హత్యలు

బాన్సువాడ : వరుస హత్య ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి. నిఘా వైఫల్యం కారణంగానే బాన్సువాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస హత్యలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు, ఓ బాలుడు, ఓ యువకుడు హత్యకు గురికాగా, తాజాగా తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఓ వృద్ధురాలి దారుణ హత్య కలకలం సృష్టించింది. పట్టణంలోని న్యూ వీక్లీ మార్కెట్‌లో నిర్మాణంలో ఉన్న భవన సముదాయంలో మద్నూర్ మండలానికి చెందిన అక్కాతమ్ముడు లక్ష్మి(26), సాయినాథ్(6) మృతదేహాలు గత నెల మే 19న లభ్యమయ్యాయి. వారి హత్యా? ఆత్మహత్యా? అనే విచారణ కొనసాగుతుండగానే అదే నెల 23న గాంధారి మండలం బుర్గుల్‌కు చెందిన లక్ష్మి(37) కృష్ణానగర్ తండా సమీపంలో హత్యకు గురైంది. నగల కోసమే లక్ష్మిని హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. మే నెలలోనే 29వ తేదీన బాన్సువాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగీతం అటవీప్రాంతంలో ఓ యువకుడి అస్థిపంజరాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడిని మహ్మద్‌నగర్ మండలం తుంకిపల్లికి చెందిన రవీందర్(36)గా గుర్తించిన పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. తాజాగా తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఉప్పరి సాయమ్మ(75)ను దుండగులు గొంతు కోసి హత్య చేశారు. నగల కోసమే ఆమెను హత్య చేశారనే అనుమానాలు వ్యక్తమవుతుండగా, పోలీసులు సైతం అదే కోణంలో విచారిస్తున్నారు. వరుస ఘటనలతో బాన్సువాడ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో బాన్సువాడలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నప్పటికీ.. కొన్ని రోజులుగా అవి పనిచేయడం లేదు. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

తండాలపై ఎక్సైజ్ దాడులు



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

మాచారెడ్డి: మండలంలోని పలు గిరిజన తండాలపై ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవీందర్ రాజు ఆదేశాల మేరకు కామారెడ్డి ఎక్సైజ్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. సోమారంపేటకు చెందిన చిట్టవేని నర్సయ్య ఇంట్లో 3 లీటర్ల నాటు సారా లభ్యమైనట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నర్సయ్యను విచారించగా సోమారంపేట కు చెందిన మాలోత్ వీణ దగ్గర తాను సారా తీసుకున్నట్లు తెలిపాడని, వీణ ఇంట్లో సోదాలు నిర్వహించగా 5లీటర్ల నాటు సారా లభ్యమైందన్నారు. సారా తయారీ కోసం ఉపయోగించే బెల్లంను గుగులోత్ దేవేందర్ వద్ద కొనుగోలు చేసినట్లు వీణ తెలుపడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే, గతంలో బైండోవర్ చేసినప్పటికీ మళ్లీ నాటు సారా తయారు చేసిన నెమలి గుట్ట తండాకు చెందిన మలోత్ సునీతకు జరిమానా విధించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై విక్రమ్, సిబ్బంది సిద్ది రాములు, ఆంజనేయులు, రమ, శ్రీరాగ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- మృతులు భిక్కనూరు మండలం మల్లుపల్లి వాసులు..
- గల్ఫ్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్తుండగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన



ఘటనాస్థలంలో అబ్దుల్లా, చాంద్ మృతదేహాలు



అబ్దుల్లా (ఫైల్)



చాంద్(ఫైల్)

భిక్కనూరు: తరాలుగా తమ కుటుంబీకులు చేస్తున్న వృత్తి తమకు అన్నం పెట్టడం లేదనే కారణంతో గల్ఫ్ దేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన ప్రాణస్నేహితులు (వరుసకు అన్నాదమ్ముళ్లు) షేక్ అబ్దుల్లా (36), సయ్యద్ చాంద్(40) ఒకే చోట పనిచేయడంతోపాటు ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్తుంటారు. తాతముత్తాతల నుంచి వస్తున్న రాళ్లు కొట్టే పని చేసిన అబ్దుల్లా, చాంద్ మూడేళ్ల క్రితం గల్ఫ్‌కు వెళ్లి వచ్చారు. స్వగ్రామానికి వచ్చిన ఇద్దరూ మళ్లీ రాళ్లుకొట్టే పని చేసినప్పటికీ మళ్లీ గల్ఫ్ వెళ్లేందుకు ఏజెంట్లను సంప్రదించారు. అయితే, రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం ఇంటర్వ్యూ ఉందని తెలుసుకొని అబ్దుల్లా, చాంద్‌తో పాటు మరో ఇద్దరు రెండు బైక్‌లపై బయల్దేరారు. ఈ క్రమంలో పెద్దమ్మ స్టేజీ వద్ద అబ్దుల్లా, చాంద్ వెళ్తున్న బైక్‌ను డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు ప్రాణస్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అబ్దుల్లాకు భార్య, ఇద్దరు పిల్లలు, చాంద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్‌ను గూడ్స్ వాహనం ఢీకొట్టిన ఘటనలో మరొకరు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మహీంద్ర గూడ్స్ వాహనం బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో భిక్కనూర్ మండలం జంగంపల్లికి చెందిన పుల్లూరి రాజు(30) మృతి చెందగా, పుల్లూరి శంకర్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాడ్వాయిలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో డప్పులు కొట్టేందుకు వచ్చిన రాజు, శంకర్ తిరిగి బైక్‌పై కామారెడ్డి వైపు వెళ్తుండగా కామారెడ్డి - ఎల్లారెడ్డి రహదారిపై పోచమ్మగుడి సమీపంలోని మూలమలుపు వద్ద గూడ్స్ వాహనం ఢీకొట్టింది. రాజు ఘటనాస్థలంలో మృతి చెందగా, గాయాలపాలైన శంకర్‌ను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీజీహెచ్ రేకుల షెడ్డులో గుర్తుతెలియని యువకుడు..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి రేకులషెడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఎడమ చేతిపై 'నాని' అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి సంబంధీకులు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో లేదా 87126 59837, 08462-220150 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దుబాయిలో గుండెపోటుతో కొత్తపల్లివాసి మృతి



భూమేశ్వర్(ఫైల్)

బాల్కొండ: బతుకు దెరువు కోసం దుబాయికి వెళ్లిన ముప్కాల్ మండలం కొత్తపల్లి వాసి కోట భూమేశ్వర్(49) అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం ఉదయం తన రూములో స్నేహితుడితో మాట్లాడుతుండగా ఛాతినొప్పి రావడంతో అక్కడున్న వారు సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆస్పత్రిలో రెండోసారి గుండెపోటు రావడంతో మృతి భూమేశ్వర్ చెందాడు. గత 30ఏళ్లుగా దుబాయిలో పనిచేస్తున్న భూమేశ్వర్ సెలవుపై స్వగ్రామానికి వస్తూ వెళ్లేవాడు. గత నెల 5వ తేదీనే భూమేశ్వర్ దుబాయికి వెళ్లాడు.

విద్యుత్ షాక్‌తో రైతు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం గగ్గుపల్లి గ్రామశివారులోని వ్యవసాయ భూమిలో విద్యుత్‌షాక్‌తో రాంపూర్ పోశన్న(55) అనే రైతు మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఆవును చంపిన ఇద్దరికి 50 రోజుల కారాగార శిక్ష

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీ సమీపంలో ఏడేళ్ల క్రితం ఆవును చంపిన ఇద్దరు వ్యక్తులకు బోధన్ కోర్టు 50 రోజుల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. జవహర్‌నగర్ కాలనీ సమీపంలో 2017 మార్చి 17న అర్ధరాత్రి గైని కృష్ణ, ఎండీ హైమద్ ఖురేషీ ఆవును చంపి పెట్రోలింగ్ పోలీసులను చూసి పరారయ్యారు. పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను కోర్టులో హాజర్చగా నేరం రుజువైంది. దోషులకు 50 రోజుల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బోధన్ కోర్టు అడిషనల్ జేఎఫ్ సీఎం మెజిస్ట్రేట్ సాయిశివ తీర్పు వెలువరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

భిక్కనూరు: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద అడ్డుకొని పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. అనుమతులు లేకుండా నాలుగు ఎద్దులను డీసీఎంలో తరలిస్తున్నారని పశువైద్యుడు రవికిరణ్ పోలీసులకు సమాచారం అందించాడు. ఎద్దులను తరలిస్తున్న డ్రైవర్ అబ్దుల్ ఇమామ్‌కురేషీతోపాటు వాటిని కొనుగోలు చేసిన ఇస్మాయిల్, విక్రయించిన దగ్గి గ్రామానికి చెందిన మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువుల సంత నిలిపివేత

ఇందల్వాయి: బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు బుధవారం మండల కేంద్రంలో కొనసాగాల్సిన సంతను నిలిపివేశారు. సీఐ మల్లేశ్, ఎస్సై మనోజ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సంతకు పశువులను తీసుకొచ్చిన వాహనాలను వెనక్కి పంపించారు.

విద్యుత్ షాక్‌తో ఆవు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేటలో దామ రాములు అనే వ్యక్తికి చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రోజూలాగే బుధవారం మేతకు వెళ్లిన ఆవు గ్రామశివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. జేఎల్ఎం రాజు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.